

వలజి - రూపకం

ఇన్ని రాసుల యునికి - యింతి చెలువపురాశి
కన్నెనీరాశి కూటమి - కలిగినరాశి

కలికి బొమవిల్లుగల - కాంతకును  ధనూరాశి
వెలయు మీనాక్షికిని - మీనరాశి
కులుకు కుచకుంభముల - కొమ్మకు కుంభరాశి
చెలగు హరిమధ్యకును - సింహరాశి

చిన్ని మకరాంకపు వయ్యెద - చేడెకు మకరరాశి
కన్నె ప్రాయపు సతికి - కన్నెరాశి
వన్నెమైబైడి దులదూగు - వనితకుసు తులారాశి
తిన్నని వాడి గోళ్లస - తికి వృశ్చికరాశి

ఆముకొను మొరపుల - మెరయు నతివకు వృషభరాశి
జామిలి గుట్టు మాటల - సతికి కర్కటకరాశి
కోమలపు చిగురు మోవి - కోమలికి మేషరాశి
ప్రేమ వేంకటపతి గలిసే - ప్రియ మిధునపురాశి

అన్నమాచార్యుల అసమాన కవితావైభవం, అనన్యకల్పనా వైదగ్ధ్యమూ ఆపాతమధుర మైన ఊహాచిత్రీకరణమూ శాస్త్ర విషయ పరిజ్ఞాన పరిపాకమూ ఈ సంకీర్తనలో ముమ్మరించి మెరుగులీనుతున్నాయి.

జ్యోతిశ్చక్రంలో ద్వాదశరాసులున్నవి. అవి మేష వృషభ మిధున కర్కట సింహ కన్యా తులా వృశ్చిక ధనుర్మకర కుంభ మీనాలు. అలమేల్మంగ జగత్స్వరూపిణి గనుక ఈ (జ్యోతి శ్చక్రమంతా) ద్వాదశరాసులన్నీ ఆమెలోనే ఉన్న విగనుకా ఆమె చెలువములన్నింటి రాశీ అయినది. శ్రీ స్వామికీ, ఆమెకూ జాతకాలు సరిపోయాయి. స్వామి రాశి కూటమిలో ఆమె రాశి మైత్రి పాటిస్తున్నదట. జన్మకాలంలో చంద్రుడేరాశిలో ఉంటే అది జన్మరాశి అవుతుంది. చంద్రుడేరాశిలో వున్నా రాసులన్నీ అలమేల్మంగలోనే ఉన్నాయి గనుక స్వామి వారి రాశిలో రాశిమైత్రి తప్పనిసరిగా కలుగుతున్నదంటున్నారు సిద్ధాంతి అన్నమయ్య గారు.

1. విల్లువంటి కనుబొమలుగల కాంత ఆమె గనుక ధనూరాశి ఆమెలో కలిగింది.

2. అలమేల్మంగ కన్నులు మీనములవలె ఉన్నాయిగనుక మీనరాశి ఏర్పడిందామెలో.

3. ఆ లావణ్యవతికి కదలుతూ కులుకుతూన్న కుచముల కుంభములున్నవి గనుక కుంభరాశి ఆమెలో దర్శనమిస్తున్నది.

4. ఆమె కృశించిన సన్ననినడుము సింహంనడుములాగ ఉన్నందున సింహరాశి ఆమె యందు ద్యోతితమౌతున్నది.

5. అలమేల్మంగమ్మ పయ్యెద - గాలికి అల్లల్లాడుతూ - మన్మధుని జెండా - మొసలి చిన్నెలున్న మరుని పతాకంవలె ఉన్నందున మకరరాశి సంతరించబడ్డది.

6. నిత్యయౌవన, కాలరహిత ఆ అలమేల్మంగ కనుక కన్యారాశి ఆమెను ఆశ్రయించింది.

7. మేలిమి బంగారంతో సరి తూగే మేనిరంగుల ఆమెలో తులారాశి నిస్తులమైనది.

8. సన్నని పొడవైన వాడిగోళ్లు గలది గనుక ఆమెలో వృశ్చికరాశి వెల్లివిరిసింది.

9. గాఢమై, అతిశయించిన రిషభాది స్వరాలు మధురంగా ఆమె గొంతులో ధ్వనిస్తు న్నందున ఆమెలో వృషభరాశి ఒనరింది. సరిగమపదనిలలో 'రి' రిషభం వృషభధ్వని సంకేతం అని సంగీతశాస్త్రం : శుద్ధ, చతుశ్రుతి షట్శ్రుతి భేదాలు మూడు రిషభంలో.

10.కర్కటకం, ఎండ్రకాయ, బొరియల్లో నివసిస్తుంది గుట్టుగా, అలమేల్మంగ మృదు మధుర మంద్ర స్వనంతో ప్రణయ రహస్యపు పలుకులొలికిస్తుంది స్వామితో. అందువల్ల ఆమె కర్కటక రాశికి కాణాచైనది.

11. మేషం - మేక - ఆకులూ చిగుళ్ళూ మేస్తూ ఉంటుంది. మేకకు ముఖాన చిగుళ్ళుంటాయట. అలమేల్మంగకు అధరాలే చిగురులైనవి కనుక ఆమెలో మేషరాశి మిడిసిపడుతున్నది.

12.

శ్రీ వేంకటపతీ ! నీవు ప్రేమతో ఆమెను కలసి కల్యాణమాడితే మిథునరాశి ఏర్పడక ఏమౌతుంది అంటూ అలమేల్మంగా శ్రీవేంకటేశ్వర కల్యాణానికి మంగళతూర్యాలు మ్రోగిస్తున్నారు అన్నమాచార్య దైవజ్ఞులు.